వున్నారు. యెటొచ్చీ సామాన్య ప్రజలకే బ్రతుకు మరీ చికాకై పోతోంది. వచ్చేది చాలకుండా వుంది. పిల్లల చదువులు రోగాలు మందులా ఖరీదైపోయాయి.

"శ్రీకృష్ణ చైతన్య ప్రభునిత్యానందం, హరె రాం హరె కృష్ణ రాధే గోపాలం, అని చిరతలు వాయిస్తూ తబలా మ్రోగిస్తూ ప్రసాదాలు ఆరగిస్తూ ధూప, దీప నైవేద్యాలతో కాలక్షేపం చేయటానికి యిది టైమ్ కాదు. లేచీ లేవటం నేను వంటింట్లోకి, మా వారు పొట్ట చేత్తో పట్టుకుని ఆఫీసుకి పరుగో పరుగు, ఏంచేస్తాం, ఆ భగవల్లీల అలాగుంది? అంతే మన చేతిలో ఏం వుంది? ఆ జీతం డబ్బులు చేతిలో పడకపోతే మన బ్రతుకులు వీధిలోకి పరుగో పరుగు. ఇంతకీ నా పాయింటేవిటంటే ఆ నిద్రపోతున్న దేవుళ్ళని లేపి మేల్కొలుపులు పాడి మన పీకల మీదకి తెచ్చుకుంటున్నాం. ఒక విషయం గుర్తుంచుకోవాలి బోయిస్ అండ్ గ(ర)ల్స్ దేవుడు మనం నిద్రలేపితే కాని లేవడు. నిద్రపోయే దేవుళ్ళను నిద్రపోనివ్వడం మంచిది. కాని నిద్రపోయే మనిషిని మాత్రం లేపటం ధర్మం. అతను కసురుకున్నా నిద్రలేచి కళ్ళు తెరుస్తాడు కదా? ఎవరైనా కళ్ళు తెరవటం మంచిదంటారా? కాదంటారా? దేవుడు ఎప్పుడూ కళ్ళు తెరవడు. అతని కళ్లు తెరిపించే ప్రయత్నాలు చేయడంకంటె, మనిషి కళ్ళు తెరిపించటం ఈజీ.

లేవండోయ్ శ్రీవారూ! లేస్తారా, చెవిలో నీళ్ళు పోయమంటారా? మీరు లేవకపోతే పాడి పంటల కార్యక్రమం బిగ్గరగాపెట్టి వెళ్ళిపోతే రేడియో కట్టెయ్యడానికని మీ అంతట మీరే లేస్తారు? కాని పొద్దున్నే రేడియో ట్యూన్ చేస్తే నేను మళ్లీ స్నానం చెయ్యాలి. ఆ చేత్తో కాఫీయిస్తే మీరు విసిరికొట్టేస్తారు కదా? ఓ నరబల్లీ, నరచిలకా, నరశార్దూలమా లెమ్ము గృహరాక్షసి. చీపురు కట్లను తెచ్చి మెట్లను చిమ్ముతున్నది. కాఫీ మరిగి మాడు వాసన వేయుచున్నది. ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద, ఉత్తిష్ఠ గరుడధ్వజ, ఉత్తిష్ఠ కమలాకాన్తత్రైలోక్యం మంగళంకురు.

# వన్సపానెటైమ్....

వన్సపానె టైమ్ (అనగనగా) ఒకప్పుడు మా "హి" గారు ఇహ్హిహి అంటూ "నీకు గ్రామఫోన్‌కీ టెలిఫోన్‌కీ తేడా తెల్సా." అని నన్ను చెట్టంతదాన్ని (నేనుచెట్టంత వుండననుకోండి. మరి తెలుగులో అలా తగలడింది మెసేజి) పట్టుకుని వేళాకోళమాడారు. ఆల్‌రైట్ పదండి సాయంత్రం తోట్లోకి అక్కడ మీ డిసీజ్ కుదురుస్తాను అని చిన్న శపథంలాటిది చేశాను. ఎక్కడైనా బావగాని వంగతోట్లో బావ కాదన్నారు కదా అని ముందు వంగతోట్లోకి తీసికెళ్లాను. "అరె యిక్కడ వంకాయ చెట్లు వేశారే" అని మావారు ఆశ్చర్యపోయారు. ఇది వంగ తోటకాదు టమాటో తోట అన్నాను. "హ్హో ఐసీ" అన్నారు కళ్ళజోడు సర్దుకుంటూ, మరి టమాటో తోట అన్నావు కదా టమాటో చెట్లకి వంకాయలు కాస్తయా అని అడిగారు. టమోటో చెట్లకి వంకాయలు

కాస్తాయి. యీ మాత్రం మీకు తెలీదా అని సీరియస్‌గానే అన్నాను. "హ్వా ఐసీ" అని మళ్ళీ కళ్ళజోడు సర్దుకున్నారు. పచ్చి మిరప మళ్ల కేసి వెళ్ళాం "వేమిటి" అన్నారు. పరిగ్గానుంచి అప్పుడే దిగొచ్చినట్లు. ఇది తులసి వనం అన్నాను. "మరైతే పచ్చిమిరపకాయలున్నట్లున్నాయ్" అన్నారు. మర్చిపోయారులాగుంది. మరి తులసి చెట్టుకే కదా పచ్చి మిరపకాయలు కాసేది అన్నాను. "హ్వా ఐసీ" అని ఇంగ్లీషు నవ్వు. అప్పుడు గోంగూర మొక్కలున్న మళ్ళకేసి వెళ్ళాము. ఇవేమిటి? ఈ ఆకులెందుకు? అన్నారు. మీ కంటె రెండాకు లెక్కువ తెలుసు నాకు అని రెండాకులు నమలమన్నాను.

ఇందకా టిఫిన్ చేశాముకదా మళ్లీ యిప్పుడెందుకన్నారు. టిఫిన్ కాదు స్వామి, నోటితో చూసి చెప్పండి. కళ్ళతో కాదు అని కొప్పడ్డాను. నమిలి "పుల్లగా వున్నాయ్ ఈ ఆకులు" అని మొహం అదోలా పెట్టారు. పొరుగింటి పుల్లకూర రుచి అన్నారు. దీన్ని బట్టే దీనిపేరుచెప్పండి అన్నాను "ఇదా-యిది". "టేమ్‌రిండ్‌కి మదరో సిస్టరో మదరిన్లానో అయుంటుంది" అన్నారు. "ది సీజ్ గోంగూర సార్" అని కళ్ళజోడు లాక్కున్నాను మళ్ళి "హ్వా ఐసీ" అని అనకుండా "గోంగూరలో ఐరనుంటుందికదూ" అన్నారు మాష్టరాఫ్ విటమిన్సు లాగ. అవును వుంటుంది మేము గరిటలు, అట్లకాడలు, వూచలు, తీగలు అన్నీ గోంగూరలోని ఐరన్‌తో చేయించుకుంటాము. మీరు ఐరన్ సేఫ్ ఓటి చేయించుకోండి." అన్నాను.

"తోటకూర మొక్కల్ను చూస్తారా" అని అడిగాను.

"అందులో ఏముంటుంది?" అన్నారు వెనకటికి ఉపనిషత్తుల్లో ప్రశ్నలడిగే ఘటంలా. "గోల్డుంటుంది. మీరు నాకు నెక్లెసులూ, గాజులూ గట్రా చేయించొచ్చు" అని నాకు నగలు చేయించే అవసరం ఒహటుంది సుమా అనిజాగ్రత్తగా హెచ్చరించాను. సమయంలో సమయం, సందడ్లో సడేమియ్యా అన్నట్లు. "కోతలు వూడ్పులూ వరినాట్లు, కలుపుతీత, నీరు పెట్టడం అంటే మీకు తెల్సా?" అన్నాను. ఐ డోంట్నో అన్నారు. "మరి అన్నం ఎలా తింటున్నారండీ, మీ కంచంలోకి అన్నం ఎలా వస్తుందో మీకు తెలీదు గదా" అని మోచేతి మీద గోకాను. అవున్సరేననుకో. ప్రతీది నాకు తెలవాలంటావా అని నాన్చారు. దేవుడు నానుస్తున్నారు కదా అని క్షమించి వదిలేశాను. తిక్క కుదిరింది రోకలి తలకు చుట్టమన్నారుగదా అని అప్పుడు చెప్తాను - వంకాయలు టమాటా చెట్లకు కాయవని. అది పచ్చిమిరప తోటేనని తులసి మొక్కకు పచ్చి మిరపకాయలు కాయవనీ ఎట్సెట్రా, అప్పుడాయన నానుస్తూ అవుననుకో - ఆ సంగతి నాకు తెల్సు కాని రోమ్ వొచ్చినప్పుడు రోమన్‌లాగా నడుచుకోవాలి గదా. నువ్ చెప్పినది విని వూకొడ్తే సరిపోయే దానికి నీ ఫీలింగ్స్‌ని హర్ట్ చేయడ మెందుకని వూరుకున్నాను. అంతే -" అన్నారు. అబ్బ - నాకు చెడ్డసిగ్గేసేసింది. తుర్రుమని పారిపోయాను, పెద్ద మనుషుల్తో ఆసికాలీవిటని తాత్కాలికంగా వంగ తోట వైరాగ్యం లాంటిది కలిగినప్పటికీ మావారికి మరదలైనా కజినైనా గోంగూరైనా నేనొక్కత్తెనే కదా, అన్ని సరదాలూ నేనే తీర్చుకోవాలి... "చెలికాడ రమ్మని చేరు నన్నొక వేళ (ఎట్సెట్రా) మన్నించు నొకవేళ మరది యనుచు" అలా

వేళాకోళాలాడ్తే మీతో గాక ఎవర్తో ఆడ్తాను యువార్ మై డింగ్ డాంగ్ బెల్ అండ్ ఐయామ్ యువర్ పుసీకాట్ నని సర్ది చెప్పేశాను.

అప్పుడప్పుడు మగాళ్ళు డన్స్‌లాగా వుంటేనే ఆడాళ్ళకి ప్రాణం హాయిగా వుంటుంది. ప్రతి సెకనూ తెలివిగా మాట్లాడి ప్రతి అంగుళం పవిత్రమైనట్లు కొల్చుకుని జీవించే మేధమేటీషన్స్‌తో వేగడం కష్టం. సోమరితనాన్ని పొగుడుతూ బర్ ట్రాండ్ రస్సెల్ అనే ఆయన "ఇన్‌ప్రైజ్ ఆఫ్ఐడిల్ నెస్" అని వ్యాసాలు వ్రాసినట్లు మా వారు చెప్పారోసారి, "సోమరి పోతు టీగలు లేకపోతే రాణీ ఈగకు ఇంపార్టెన్సెలాగొస్తుంది? సోమరితనం నుంచే కొత్త ఆలోచన్లు పుట్టేది – వర్క్ మైండెడ్ బిజీ పురుషుల వల్ల సొసైటీకి చాలా హోరం జరుగుతుంది. ఇరవైనాలుగ్గంట ల్లో పన్నెండు గంటలు దేవుడెందుకు నిద్ర పొమ్మన్నాడు. దేవుడేం వెర్రి కుట్టా – నిద్రపోవడమంటే ఓ రకంగా చచ్చినట్టు చావకుండా పడుండటం. యాక్టివ్ ప్రపంచం నుంచి విత్‌డ్రా అయి కళ్లు మూసుకు పడుకోటం, నిద్రపోతున్నవాడు ఎవరికీ ఏ అపకారంచేయలేడు. వాడి ఒంటిమీద గుడ్డసరిగా వుందో లేదో వాడికే తెలీదు. (కాని నైట్ డ్రెస్ అని మేలుకున్నాక అందరూ చూసి మెచ్చుకోడానికి కుట్టించుగుంటాడు. గుంటైతే నైట్‌గవున్స్ తొడుగుతుంది)ఈ నైట్‌డ్రెస్ అనేమాట వింటే నాకు కడుపు చెక్కలయేలా నవ్వువస్తుంది. మేం రాత్రిళ్ళు దుస్తులు ధరించే వుంటాము సుమా అని లోకానికి చాటేందుకు ఎవరికి వారు పన్నిన వల సుమా దుస్తులు ధరించకపోవటం ప్రకృతి. దుస్తులు ధరించటం దానికి వికృతి. మేం ఎల్లప్పుడూ వికృతంగానే వుంటాము సుమా అని చాటి చెప్తారు నాగరిక్స్. దుస్తులు ధరించని సరిగా ధరించని బొమ్మలును న్యూడ్ పిక్చర్స్‌ను ఎందుకు మెచ్చుగుంటాం? తాచుపాముకీ ట్వింకిల్ నైలాన్ పంచీ కుట్టించండి: (కొందరు కుక్కలకి బ్లేజరు కోట్లు తొడుగుతారు) పులికి చీర కడితే ఎలాగుంటుంది? సింహానికి బంగాళీలాల్చీ కళ్ళీపంచా ఎవరైనా కుట్టించి తొడగ్గలరా? నేచర్‌లో ప్రతివస్తువూ ఒరిజనల్‌గా బ్యూటిఫుల్‌గా వుండిపోగలుగుతుంది. మనిషి నిద్ర పోతూంటే అందుకే ఎంతో అమాయకంగా, సహజంగా, అందంగా వున్నట్లు కనిపిస్తాడు. నిద్రపోయే ఆడాళ్ళకు డ్రెస్ అస్తవ్యస్తంగా తొలగిందనుకోండి, చూసేవాళ్లకు నోట్లోంచి నీళ్ళు కారుతాయి. స్లీపింగ్ బ్యూటీలని వేరే వుండరు. మనమంతా స్లీపింగ్ బ్యూటీసే. కొందరు చచ్చిపోయిన వాళ్ళు నిద్రపోతున్నట్లుంటారు, కొందరు నిద్రపోయినవాళ్ళు చచ్చిపోయిన వాళ్ళలాగుంటారు. శరీరాన్ని దిగంబరంగా వుండమనుకోవటం నాగరికత ఒప్పదు గనుక డ్రెస్ తప్పనిసరి మినిమండ్రెస్ వేసుకోవటం మంచి దేమోననిపిస్తుంది. దేహాభిమానం లేకుండా వుండటం యిద్దరికే చెల్లుతుంది. విరాగులకు భోగులకు, అయితే లోకం కోసం ఎన్ని వేషాలు వేసినా ఎన్ని చీరలు విప్పినా కట్టినా అంతా కాట్లోకే ఎళ్తాము గనుక మనసును దిగంబరంగా అట్టె ముసుగులు లేకుండా స్వచ్ఛంగా స్ఫటికంలా వుంచుకోవాలి. అదే జీనియస్‌కి మనకీ వుండే తేడా.

గొప్పవాళ్లంత సింపుల్‌టన్స్ లాగా ఇడియట్స్‌లాగా ఎందుకుంటారు? వాళ్ళకి స్వప్న రూపం జ్ఞానం వుండదు. త్రాచుపాముకి బువ్వతినిపిస్తూ ఆడుకునే పసిపిల్ల వాడిలాగుంటారు

జీనియస్సులు. (కాని వాళ్ళే కత్తుల సుబ్బారావులై పోతారు) కవులుగాని. సంగీత విద్వాంసులుకాని చిత్రకారులుగాని ఎవరైనా కొంత మంది అసలు సరుకున్నవాళ్ళలా కనిపించరు. బైతుల్లాగుండి లోకాన్ని బోల్తా కొట్టిస్తారు. ఎందుకూ పనికిరాని టప్పెన్స్‌గాళ్ళు మాత్రం హేచ్ ఈ హెచ్ ల్లాను, హెచ్ ఈ ల్లాను పోజులు పెడుతూంటారు.

అయితే యింత గ్రంథం ఎందుకు పెరిగిందంటే వంగతోటలోనే వాడిన మాటలకన్నిటికీ వూకొట్టి నాకొక గుణపాఠం నేర్పారు మాయింటి మహారాజా. మావారు ఫ్యూడల్ లార్డ్ కారనుకోండి. నాస్తికులై తేమటుకు శ్రీవారు అనడం మానేసారా? పరుపులూ దిళ్ళూ పందిరి మంచం బూర్జువా కల్చర్ అనిచెప్పి క్రిందపడుకోవడం లేదెవ్వరూ (లేకపోతేతప్పు) మహారాజ రాజశ్రీ అన్నా చిరంజీవి సౌభాగ్యవతి అన్నా మీరు నన్ను తప్పుపట్టకూడదు. కొన్ని పిలుపులు. మర్యాదలు సరదాలు అలానే అట్టే పెట్టుకోవడం బెష్టు. సన్న బియ్యపన్నం, నేతిపోపులూ, బూరెలూ గారెలూ, అరిసెలూ, అప్పడాలూ, మజ్జిగపులుసూ, దప్పళ్ళం యివంటే ఎంతిష్టమో నాకు మావారిని మహారాజు అని పిల్చుకోవడం కూడా అంతే యిష్టం. నా చతురంబోధి పరీత భూవలయ ప్రణయమనో సామ్రాజ్యానికి ఏకైక లార్డ్ - ఐయామ్ హిజ్ మాస్టర్స్ వాయిస్! బట్, నీకు గ్రామఫోన్‌కి టెలిఫోన్‌కి తేడా తెల్సా అని మావారు నన్ను వెక్కిరించబట్టి యింత గ్రంథం పెరిగింది. ఎక్కడైనా బావగాని వంగతోట్లో బావగాదు . ఆమాట నిజమే- మనం రాణీలా కబుర్లు చెప్పాలంటే మనపార్ట్ నర్ పురుషోత్తముడు కాకతప్పదు. పురుష ద్వేషిణులు ఈ రహస్యమును గమనింతురుగాక! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!

# ఎవరింట్లో పూస్తేనేం?

**మా** ఇల్లు బొమ్మరిల్లు, మా సంసారం లిక్కి సంసారమూను. ఇరవై ఏళ్ళ క్రితం ఇండిపెండెంట్‌గా మేం కాపరం పెట్టిన కొత్తలో - అప్పటికి మావారికింకా సార్వభౌమాధికారాలు సంక్రమించలేదు. మాది డొమినియన్‌స్టేటస్... చిన్న గుండుపప్పు గిన్నెకొనమంటే, అవసరమో కాదో అమ్మకు ఉత్తరం రాసి కనుక్కుంటాను అనేవారు మా గుర్గూగారు. మేం సంసారం పెట్టిన ఎర్లీడేస్‌లో అంటే ట్వంటీ ఏళ్ళక్రితం రేకుగిన్నెలో తలగొట్టి తవ్వెడు బియ్యం అత్తెసరు కుంపటిమీద పడేస్తే అది మా ఇద్దరికీ ఎక్కితక్కిఅయి తినలేక గుడ్లు తేలేసేవాళ్ళం.

మా కిద్దరికీ ఓ పూటకు సరిపడే కూర అల్లం పచ్చిమిరపకాయలు అండ్ ఆల్సో ఉల్లిపాయలు మావారు కొని ప్యాంటు జేబులో పోసుకొచ్చే వారు. ఇప్పుడు మా ఇంట్లో కూరల్సంచీ అప్పుడు మాకు బియ్యపు సంచి ఇన్ దోజ్ డేన్. పావలాపెట్టి పకోడీలు మిఠాయి కొమ్ములు రెగ్యులర్‌గా